క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం



కంకిపాడు: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయనున్నట్లు కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలోని గొడవర్రు, పునాదిపాడు గ్రామాల్లో పేకాట, కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలపై ఆదివారం డ్రోన్‌లను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు గ్రామాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడి పందేలు, పేకాట శిబిరాలను పూర్తి స్థాయిలో నిఘా ఉంచుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు నిఘా కట్టుదిట్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డి.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి



పెనమలూరు: తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టపై నివాసితులకు మురుగునీటితో సమస్యగా ఉందని ఎమ్మెల్యే బోడెప్రసాద్ దృష్టికి స్థానికులు తీసుకు వచ్చారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసాద్ తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టపై ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలు తెలుపుతూ ప్రభునగర్ నుంచి వచ్చే మురుగునీరు బందరు కాలువలో కలపటానికి తమ ఇళ్ల మధ్య నుంచి పైప్‌లైన్‌లు వేస్తారని చెబుతున్నారన్నారు. ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. తమకు కొత్తగా పింఛన్‌లు మంజూరు కాలేదని, ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ పింఛన్‌లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి పలువురు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



ఉంగుటూరు(గన్నవరం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికులందరూ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉంగుటూరులో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కళ్ళం మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కేంద్రం లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు చేపట్టిన సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు టీవీ. లక్ష్మణస్వామి, అజ్మీరా వెంకటేశ్వరరావు, కే రామరాజు పాల్గొన్నారు.

కరప్రతాల పంపిణీ

గన్నవరం: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ నేతలు గన్నవరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. పాలకుల వైఖరికి నిరసనగా చేపట్టిన సమ్మెకు ప్రజలు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

ఉయ్యూరు: విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలను మెరుగుపర్చాలంటే ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ అన్నారు. ఉయ్యూరు ఎన్జీఓ హోంలో ఎస్టీయూ కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పీఆర్సీ, సరెండర్, గ్రాట్యూటీ బకాయిలు చెల్లింపునకు నోచుకోవటం లేదన్నారు. నూతన పీఆర్సీకి నూతన కమిషనర్‌ను నియమించకపోవటం భావ్యంకాదన్నారు. ఆర్థిక బకాయిల సమస్యల పరిష్కారానికి జేఏసీ నాయకత్వంలో త్వరలోనే పోరుబాట పడతామని స్పష్టంచేశారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే నూరుశాతం పరిమితం చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని, షైనింగ్ స్టార్స్ ప్రోత్సాహకాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే పరిమితం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు అధికారులపై ఆధారపడకుండా విద్యా రంగంలో క్షేత్రస్థాయిలో వాస్తవాలను గ్రహించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకా ఇమ్మానుయేలు, చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, నాయకులు ప్రసాద్, మాధవరావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పదోన్నతులు పొందిన, బదిలీలపై వెళ్లిన సంఘ సభ్యులను ఘనంగా సత్కరించారు.

అండర్ పాస్.. డేంజర్ స్పాట్

- ప్రమాదాలకు నిలయంగా బీబీగూడెం ఫ్లైఓవర్ అండర్ పాస్
- సమస్యపై దృష్టిపెట్టని పోలీసులు
- ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



బీబీగూడెం ఫ్లైఓవర్ అండర్ పాస్

గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం ఫ్లైఓవర్ వద్ద ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు టెన్షన్‌కు గురవుతున్నారు.

అనేక ప్రాంతాలకు కూడలి మార్గం

బీబీగూడెం ఫ్లై ఓవర్ దిగువ నుంచి గన్నవరం నుంచి వాహనాలు బీబీగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, తోటపల్లి, ఆగిరిపల్లి గ్రామాల మీదుగా నూజివీడు వెళుతుంటాయి. కొత్తగా హైవే బైపాస్ నిర్మించటంతో, దానికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మాణం కావటంతో నున్న నుంచి వాహనాలు నేరుగా చిన అవుటపల్లి వరకూ వెళుతున్నాయి. ఈరోడ్డు హైవే బైపాస్ కావటం, ఎంతో విశాలంగా నిర్మాణం కావటంతో అతివేగంగా వాహనాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో గన్నవరం నుంచి బీబీగూడెం, బీబీగూడెం వైపు నుంచి గన్నవరం వెళ్లే వాహనాలు వేగంగా నడుస్తున్నాయి.

పెరిగిన ట్రాఫిక్..

గన్నవరం నుంచి గన్నవరం మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాలు కొండపావులూరు, గోపవరపుగూడెం, ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం, బీబీగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, కొత్తగూడెం, చింతగుంట, కంఢ్రిక, వీరపనేనిగూడెం గ్రామాలకు నిరంతరం రాకపోకలు సాగించే ఆయా గ్రామాల ప్రజలు బీబీగూడెం నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

వేగ నియంత్రణ చర్యలు శూన్యం

ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు శూన్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ప్రదేశంలో ట్రాఫిక్ పోలీసులు రాకపోకల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందంటున్నారు. వాహనదారులను ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.



ప్రమాదాలు అరికట్టాలి

బీబీగూడెం ఫ్లైఓవర్ వద్ద ప్రమాదాలు నివారించాలి. ట్రాఫిక్ పోలీసులను నియమించాలి. మెట్ట ప్రాంత గ్రామాల ప్రజలు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్డు మార్గం సులువుగా ఉండటంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిపోయింది.

– బెజవాడ తాతబ్బాయి, మాదలవారిగూడెం



ప్రమాదాల నుంచి కాపాడండి

రహదారులు ఆధునికీకరించటంతో వాహనాల వేగం పెరిగింది. వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ప్రయాణాలు సరళం అయ్యాయి. దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకుని ట్రాఫిక్ పోలీస్ ప్రమాదాల నుంచి వాహనదారులను కాపాడాలి.

– ఎం.నాగేశ్వరరావు, సీఐటీయూ నేత, గన్నవరం

వంశీకి జగన్‌మోహనరావు పరామర్శ



వల్లభనేని వంశీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. తేలప్రోలు లో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఆదివారం పరామర్శించారు. వంశీ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వంశీపై అక్రమంగా కేసులు పెట్టి 140 రోజులు రిమాండ్‌లో ఉంచడం బాధాకరమన్నారు. నిష్పక్షపాతంగా పని చేయాల్సిన పోలీసులు సైతం కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు మహ్మద్ మస్తాన్, గాదెల వెంకటేశ్వరరావు, ఆకుల హనుమంతరావు, రామిరెడ్డి సీతయ్య, గుదే అక్కారావు, సీహెచ్ రవికిరణ్‌రెడ్డి, స్టాలిన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మురుగు నీరు

వాహనాల రాకపోకలకు అంతరాయం



కానూరులో జాతీయ రహదారిపై చేరిన మురుగునీరు

పెనమలూరు: విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారిపై మురుగునీరు చేరింది. ఇటీవల రోడ్డుకు ఇరుపక్కలా డ్రెయినేజీల నిర్మాణం చేసినా మురుగునీరు మాత్రం రోడ్డు పైనే ఉండి పోతోంది. దీంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కానూరు కామయ్యతోపు నుంచి ఇంజినీరింగ్ కాలేజీ వైపునకు వచ్చే బందరు రోడ్డు డాల్ఫిన్ ఎస్టేట్ ఎదురుగా డ్రెయినేజీ నుంచి మురుగునీరు బందరు రోడ్డు పైకి వచ్చి చేరుతోంది. ఇక వర్షం పడితే మోకాలు లోతులో మురుగునీరు నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనివల్ల రోడ్డు అనతికాలంలోనే దెబ్బతినే అవకాశం ఉంది.

డ్రెయినేజీలపై ఆక్రమణలు

జాతీయ రహదారి పక్కన నిర్మించిన డ్రెయినేజీలు ఆక్రమణలకు గురయ్యాయి. దుకాణాల యజమానులు డ్రెయినేజీలపై కాంక్రీట్ వేశారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణం చేయకుండా ఆపారు. వర్షం పడితే ఆక్రమణల కారణంగా మురుగునీరు డ్రెయినేజీలో ప్రవహించటం లేదు. డ్రెయినేజీలు నిర్మాణం చేసినా ఆక్రమణల కారణంగా నిరుపయోగంగా మారాయి. దుకాణాల ఎదుట మూసివేసిన డ్రెయినేజీల ఆక్రమణలు తొలగించి రోడ్డు పైన మురుగు నీరు నిలవకుండా డ్రెయినేజీలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్



ముస్తాబాదలో కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ అందజేసిన డాక్టర్ మేరీ వైడూర్యం



గన్నవరంలో యాంటి రేబిస్ టీకాలు వేస్తున్న డాక్టర్ సురేష్



ఈడుపుగల్లులో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ మాధవరావు



బాపులపాడులో కుక్కకు టీకా వేయిస్తున్న డాక్టర్ ప్రమీలారాణి

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు చెందిన క్లినికల్ కాంప్లెక్స్‌లో ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమాన్ని టీవీసీసీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కే సురేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వీటిలో కుక్కల నుంచి వచ్చే రేబిస్ వ్యాధి ప్రాణాంతకరమైనదన్నారు. ఈ వ్యాధి నుంచి రక్షణ కోసం పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటి రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం 227 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు చేశారు. కళాశాల విభాగాధిపతులు డాక్టర్ టీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.లక్ష్మీరాణి, డాక్టర్ సీ పవన్‌కుమార్, డాక్టర్ బీ చంద్రప్రసాద్, డాక్టర్ వై చైతన్య, డాక్టర్ పి.రమేష్, డాక్టర్ బీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద ప్రభుత్వ పశువైద్య చికిత్స కేంద్రంలో ఆదివారం 110 కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. వైద్యాధికారి డాక్టర్ మేరీ వైడూర్యం ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, పరిశుభ్రత పాటించాలని, అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పశు వైద్యశాల వద్ద ఆదివారం పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశువైద్యాధికారి కె. సతీష్‌కుమార్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు, పిల్లులకు సంవత్సరానికి ఒకసారి యాంటీ రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. 75 కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ఎంపీటీసీ సభ్యులు రవికాంత్, జేవీవో కాశిం, ఏహెచ్‌ఏలు సంధ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: ప్రపంచ జూనోసిస్‌డేను కంకిపాడులో ఆదివారం నిర్వహించారు. కుందేరు, కంకిపాడు, ఈడుపుగల్లు పశువైద్య కేంద్రాల్లో 500 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందించారు. ఈ సందర్భంగా ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కె.మాధవరావు మాట్లాడుతూ కుక్కల పెంపకందారులు క్రమం తప్పకుండా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కుక్కల నుంచి మనుషులకు రేబిస్ సోకకుండా జాగ్రత్త అవసరమన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రభుత్వ పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ బాపులపాడు ఏడీ డాక్టర్ ఎం.ప్రమీలారాణి మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే చికిత్స లేని ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి నివారణకు ఏటా పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. 92 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేశామన్నారు. పశుగణన సహాయకుడు కె.రామకృష్ణ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయం



గన్నవరంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు



ఉయ్యూరులో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ పార్కులో ఆదివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నేతలు ఏపూరి ప్రసాద్, ఏసుపాదం, తిరివీధి కోటయ్య, ఇందుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సుందరయ్య పార్కు సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఈఎఫ్ నేతలు దేవరపల్లి విక్టర్‌బాబు, ఏసుబాబు, బాలస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగ సంఘాల నేతలు ఉడుముల దుర్గారావు, తిరువీధి భాస్కరరావు, చంద్ర శేఖర్‌రావు, వల్లభనేని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

ఉయ్యూరు: ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీలోని ఐదో వార్డులో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు జె.నరసింగరావు, బొకినాల కృష్ణ, ఈడుపుగంటి రాజా, ఉయ్యూరు సుధాకర్, రాజు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



రక రకాల పూలతో శ్రీవేంకటేశ్వరస్వామి అలంకారం



శాకంబరీదేవి అలంకరణలో శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణమ్మ



ఉయ్యూరులో షిర్డీ సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

విజయవాడరూరల్: ఆషాఢ తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం పలు వైష్ణవ దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వరస్వామికి, శ్రీ రామచంద్రమూర్తికి, శ్రీ వేణుగోపాలస్వామి వార్లకు విశేష పూజలు చేశారు. నున్న గ్రామంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న చినకంచిలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి విశేష పూజలు, హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య లో స్వామి వారిని దర్శించుకున్నారు. కొత్తపల్లి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర విశేష అర్చనలు చేసి పది రకాల నివేదనలు స్వామికి సమర్పించారు. తొలి ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించి పేలాల పిండి, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. దేవదాయశాఖకు చెందిన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం జరిగింది. అభిషేకాలు నిర్వహించి, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. నున్న తూర్పు రామాలయం, పడమర కోదండ రామాలయం, బోడపాడు శ్రీ భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయంలో తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అలంకారం చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు పేలాల పిండి ప్రసాదాన్ని అందజేశారు. మంగళాపురం గ్రామం, విలేజి కండ్రికలోని శ్రీరామాలయాల్లో భక్తులు తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని భక్తులు వేకువజాము నుంచే అమ్మవారి దర్శనార్థం బారులు తీరారు. ముగ్గురమ్మలను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామికి పలు అభిషేకాలు నిర్వహించారు.

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా శాకంబరి ఉత్సవాలను నిర్వహించారు. శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించి నర్రా అనిల్‌కుమార్, జాస్తి వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. వివిధ రకాల నైవేద్యాలతో కూడిన అషాఢ సారెను అమ్మవార్లకు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో..

స్థానిక చెంచులకాలనీలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆదివారం పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అషాఢ సారెను సమర్పించారు. సంఘ నాయకులు చిమట గంగాధరరావు, చిమట రవివర్మ, పటాపంచుల సాంబశివరావు, నాగభూషణం, పిన్నిబోయిన రమేష్, చెన్ను బాబీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని అంతటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని తోట్లవల్లూరు రోడ్డులో సాయిబాబా ఆలయం, గండిగుంట షిర్డీ సాయి మందిరాల్లో సామూహిక సాయి సత్య వ్రతాలు ఆచరించారు. పంచామృత అభిషేకాలు చేయించారు. పూజా కార్యక్రమాన్ని అర్చకుడు కామేశ్వర శర్మ పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే అన్నే బాబూరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు మురళి, ప్రియాంక, ప్రసాద్, అరుణ అన్నసమారాధన జరిపించారు.

108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు 108 కలశాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ తరుపున మాజీ సర్పంచ్ కాకాని అరుణ పూజా ఏర్పాట్లు చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



గొల్లనపల్లిలో అమ్మవార్లకు సారె సమర్పించిన వెంగల గోవర్ధన్ దంపతులు



యనమలకుదురులో ఆషాఢ సారెతో వస్తున్న భక్తులు

గన్నవరం రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో శ్రీ పోలేరమ్మ, శ్రీ గంగానమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు సారె సమర్పించారు. పాలపొంగళ్లతో, బేతాళ వేషాలతో, డప్పు వాయిద్యాలు, మంగళ హారతులతో అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివెళ్లారు. అమ్మవార్లకు వెంగల గోవర్ధన్ దంపతుల ఆధ్వర్యంలో సారె సమర్పించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారికి ఆషాఢ సారె భక్తులు సమర్పించారు. గ్రామానికి చెందిన వెలగపూడి సాంబశివరావు దంపతులు శ్రీపార్వతీదేవి అమ్మవారికి ఆషాఢ సారె తీసుకు వచ్చారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో ఆలయ ప్రదర్శన చేశారు. అంతరం శ్రీ పార్వతీదేవి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ.సాగర్, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎస్.భవాని పాల్గొన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తులకు నూజివీడు న్యాయస్థానం నాలుగు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వీరవల్లి ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. గత ఐదు రోజులుగా బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో అరెస్ట్ అయిన 8 మందిని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మరో ఏడుగురు మందు బాబులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.